క్లుప్తంగా

క్రీడల అభివృద్ధికి దాతలు సహకరించాలి



క్రీడాకారులతో జెడ్పీటీసీ వీరప్రసాద్, పీఈటీలు

అర్వపల్లి : గ్రామీణ క్రీడల అభివృద్ధికి దాతలు సహకరించాలని జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్ యాదవ్ కోరారు. సీఎం కప్ క్రీడోత్సవాలో భాగంగా జాజిరెడ్డిగూడెం మండలం నుంచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు మంగళవారం మండల కేంద్రంలో తన సొంత ఖర్చులతో క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీడీ సోమయ్య, పీఈటీలు రవి, సైదులు, క్రీడాకారులు ఉన్నారు.

డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నకు సన్మానం



వెంకన్నను సన్మానిస్తున్న నాయకులు

నాగారం : సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రెండో సారి నియమితులైన చెవిటి వెంకన్నయాదవ్‌ను మంగళవారం మండల కాంగ్రెస్ నాయకులు సూర్యాపేటలో ఆయనను కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్యయాదవ్, జాజుల వీరయ్య, కన్నెబోయిన వెంకటభిక్షం, పంది శ్రీనివాస్, కమటకం శ్రీనివాస్, మామిడి నాగయ్య, రవీందర్, వెంకన్న, రవి, దశరథ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భిక్షం

పెన్‌పహాడ్ : గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీపీ నెమ్మాది భిక్షం వైద్యసిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన జనారోగ్య సమితి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో స్వచ్ఛత, పరిశుభ్రత, జీవనశైలి, వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకొని తగిన పరిష్కారాలు చేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీటీసీ జానకమ్మ, జూలకంటి వెంకటరెడ్డి, బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వైద్యాధికారి ప్రవంతి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరు హర్షణీయం

నాగారం : మండలంలోని వర్ధమానుకోట గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ నిధులు మంజూరు చేయించడం హర్షణీయమని ఎంపీటీసీలు ఈరేటి స్వప్నఅంజయ్య, వడ్డే పరుశరాములు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి రూ.16లక్షలు మంజూరైనట్లు తెలిపారు.

వ్యవసాయ మార్కెట్ కార్యదర్శికి వినతి



కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న కమీషన్‌దారులు, హమాలీలు, స్వీపర్లు

తిరుమలగిరి (తుంగతుర్తి) : ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించకుండా తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఉన్న షెడ్లల్లో దిగుమతి చేయకుండా చూడాలని అర్తి అసోసియేషన్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం మార్కెట్ కార్యదర్శి సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మార్కెట్ యార్డులో ఉన్న షెడ్లలో ధాన్యం బస్తాలు దింపడంతో ఆరుబయట ధాన్యం పోసి కాంటాలు వేయాల్సి వస్తుందని, వేసవి కాలంతో పాటు వర్షాలు వస్తుండటంతో రైతులు, హమాలీలు, స్వీపర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. షెడ్లలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను నింపడానికి జిల్లా అధికారులు అనుమతి ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. వినతి అందించిన వారిలో అర్తి అసోసియేషన్ అధ్యక్షుడు సంకెపల్లి నర్సింహారెడ్డి, సామ ఆంజనేయులు, శెర్విరాల సుధాకర్, రాపాక సోమేష్, శేఖర్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, లక్ష్మణ్, శ్రీధర్, మురళీమోహన్, రామచంద్రు, యాదగిరి, వెంకన్న, పరశురాములు, బహద్దూర్, నర్సయ్య, కొండయ్య, సోమలింగం, నర్సింహ ఉన్నారు.

పంచాయతీ భవనాలకు స్థలాల కొరత

- అద్దె భవనాల్లోనే సాగుతున్న పాలన
- 5నూతన పంచాయతీలకు నిధులు.. ఒక్కచోటే పనులు మొదలు
- ఒక్కో భవనానికి రూ.20లక్షలు చొప్పున మంజూరు
- స్థలాల సమస్య తీర్చి భవనాలు నిర్మించాలని సర్పంచ్‌ల వినతి



బొల్లంపల్లిలో నిర్మాణంలో ఉన్న పంచాయతీ కార్యాలయ భవనం



రామన్నగూడెంలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న పంచాయతీ కార్యాలయం

అర్వపల్లి : గ్రామాల్లో పరిపాలన సౌలభ్యం కోసం తెలంగాణ ప్రభుత్వం కొత్తగా శివారు గ్రామాలు, తండాలను నూతన గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసింది. అయితే కొత్తగా ఏర్పడిన పంచాయతీ కార్యాలయాలు దాదాపు అన్ని అద్దె భవనాలలో పాలనసాగిస్తున్నాయి. అయితే వాటికి సొంత భవనాల నిర్మాణం కోసం 6నెలల కిందట ఉపాధిహామీ పథకం నుంచి ఒక్కో పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.20లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. అయితే ఆయా గ్రామాల్లో భవనాల నిర్మాణాలకు స్థలాలు దొరక్క ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. జాజిరెడ్డిగూడెం మండలానికి సంబంధించి 5 గ్రామపంచాయతీలకు కొత్తగా భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు కాగా ఇప్పటి వరకు ఒక్క గ్రామంలోనే స్థల సేకరణ జరిగి పనులు సాగుతున్నాయి. మిగిలిన చోట్ల స్థలాలు లభ్యం కాక ఇంతవరకు పనులు మొదలు కాలేదు.

మండలంలో..

జాజిరెడ్డిగూడెం మండలంలో నూతనంగా బొల్లంపల్లి, ఉయ్యాలవాడ, రామన్నగూడెం, సూర్యనాయక్ తండా, నాన్యతండాలను నూతన పంచాయతీలను ఏర్పాటు చేశారు. దీంతో అక్కడ పంచాయతీ భవనాల నిర్మాణానికి ఇటీవల నిధులు మంజూరయ్యాయి. గతంలో కుంచమర్తి గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఉపాధిహామీ నుంచి రూ.16లక్షలు మంజూరు కాగా ఇంతవరకు పనులు మొదలు కాలేదు. కాగా బొల్లంపల్లిలో పంచాయతీ భవన నిర్మాణం శ్లాబ్ లెవల్ వరకు జరిగింది. మిగిలిన ఉయ్యాలవాడ, రామన్నగూడెం, సూర్యనాయక్‌తండా, నాన్యతండాలలో స్థలాల సమస్యతో ఇంతవరకు పనులు ప్రారంభించలేదు. ఆయా గ్రామాల్లో భవనాలు లేక కార్యాలయాలను ప్రస్తుతం అద్దె భవనాల్లోనే పాలన సాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్థలాల సమస్యను పరిష్కరించి పంచాయతీ భవనాలను నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

స్థలం సమస్యతో పనులు ప్రారంభించ లేదు



మాగ్రామంలో పంచాయతీ భవన నిర్మాణానికి స్థల సమస్య తేలకపోవడంతోనే ఇంతవరకు పనులు ప్రారంభించలేదు. రెండు చోట్ల స్థలాలను చూశాం. అయితే ఇందులో ఒక స్థలం ఊరికి దూరంగా ఉండటంతో గ్రామస్తులు ఒప్పుకోవడం లేదు. త్వరలో స్థల సమస్యను తీర్చిపనులు ప్రారంభిస్తాం.

– రమావత్ పీరమ్మ, సర్పంచ్ రామన్నగూడెం

స్థలాల కొరత ఏర్పడింది



కొత్త గ్రామపంచాయతీల్లో పంచాయతీ భవనాల నిర్మాణానికి ఇటీవల రూ.20లక్షల నిధులు మంజూరయ్యాయి. కాని గ్రామాల్లో స్థలాల సమస్యతో పనులు ప్రారంభించలేక పోతున్నాం. మండలంలో బొల్లంపల్లిలో పనులు ప్రారంభించాం. మిగిలిన గ్రామాల్లో స్థలాలకు ఇబ్బంది అవుతుంది. స్థలాల సమస్యను పరిష్కరించి త్వరలో పనులు ప్రారంభిస్తాం.

– గుర్రం కొండయ్య, పీఆర్ డీఈఈ

మహాధర్నాను విజయవంతం చేయాలి

మద్దిరాల : అఖిలపక్షాల ఆధ్వర్యంలో నేడు(బుధవారం) తిరుమలగిరిలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత బంధులో జరిగిన అవినీతిపై, దళితులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ తిరుమలగిరిలో నిర్వహించే మహాధర్నాకు అఖిలపక్షం నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు బర్పటి ఉపేందర్, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపెల్లి సురేష్‌గౌడ్, హమీద్, బానోతు శ్రీను, ఉపేందర్, లింగయ్య, యాకయ్య ఉన్నారు.

నాగారం : నేడు తిరుమలగిరి మండల కేంద్రంలో నిర్వహించే అఖిలపక్ష సమావేశానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అఖిలపక్ష సమావేశానికి కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాలు, పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : పట్టణంలో నేడు (బుధవారం) అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమయ్య తెలిపారు. మంగళవారం మున్సిపాలిటీ కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహాధర్నాకు కాంగ్రెస్, బీజేపీ, వైఎస్ఆర్ తెలంగాణ, సీపీఎం, ఇతర ప్రజాపక్షం నేతలు హాజరు కానున్నారని తెలిపారు. ఆయన వెంట సీపీఎం నాయకులు కడెం లింగయ్య, శ్రీనివాస్, నరేష్ తదితరులున్నారు.

ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలపై ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నిరుద్యోగ వ్యతిరేక విధానాలపై నేటి యువత ఉద్యమించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలో ధర్మభిక్షం భవనంలో బూర సైదులు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను పూర్తిస్థాయిలో భర్తీ చేస్తామని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని, ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని తుంగలో తొక్కారని విమర్శించారు. నిరుద్యోగ భృతి కింద ప్రతి నిరుద్యోగికి రూ.5వేలు ఇవ్వాలన్నారు. సమావేశంలో అఖిల భారత యువజన సమైఖ్య పట్టణ కార్యదర్శి బీపీ నరేష్‌రెడ్డి, మైనార్టీ నాయకులు పాషా, పెంద్ర కృష్ణ, పట్టణ సహాయ కార్యదర్శి అయితగాని కామేష్, కోశాధికారి ఏడెల్లి శ్రీకాంత్, వాడపల్లి గోపి పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



నాగారంలో పాలాభిషేకం చేస్తున్న జేపీఎస్‌లు



పెన్‌పహాడ్‌లో..

నాగారం : గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శు (జేపీఎస్)లను క్రమబద్ధీరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ మంగళవారం జేపీఎస్‌లు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. జేపీఎస్‌లను రెగ్యులర్ చేయాలని ప్రకటించడం పట్ల వారు సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కొమ్ము అరుణ్, శోభన్, శ్రీనివాస్, భవాని, సతీష్, వీరేందర్, వెంకటేష్, సంతోష్, జిందగిరి, గోపి, శివ, అంబేద్కర్ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ ప్రకటనకు కృతజ్ఞతలు తెలియజేస్తూ మంగళవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీఎం కేసీఆర్, మంత్రులు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, దయాకర్‌రావుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రమేష్, దివ్య భారతి, సతీష్, రాజేష్, సోమయ్య, శివ, లావణ్య, మునీర్, జాని, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయనున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ధరావత్ కుమారి బాబునాయక్, ఎంపీడీఓ ఎల్.లక్ష్మి, ఎంపీఓ టి.గోపి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు జూలకంటి సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ఓప్పుల బక్కయ్య, గణపారపు మధు, బొల్లం అశోక్, అరవిందు నారాయణ, రజిని, స్రవంతి, గ్రీష్మ, మధు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



సూర్యాపేట రూరల్ : కాసరబాదలో డ్రెయినేజీలు శుభ్రం చేస్తున్న జెడ్పీటీసీ భిక్షం

సూర్యాపేట రూరల్ : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కాసరబాద గ్రామంలో పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా డ్రెయినేజీల్లో పూడిక తీయడంతో పాటు రోడ్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ కొల్లు రేణుక, ఎంపీటీసీ బంటు నాగమ్మ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమణారెడ్డి, రమేష్, కార్యదర్శి సలీం పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్ కోరారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ కుదురుపాక శ్రీలతారాములు, ఖదీర్, లక్ష్మణ్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : మండలంలో వారం రోజులుగా జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో గ్రామపంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. చివరి రోజున మండలంలోని ఉయ్యాలవాడ, రామన్నగూడెం గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను ఎంపీఓ ఉపేందర్‌రావు పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

నాగారం : పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో ఉత్తమ పారిశుద్ధ్య కార్మికుడిగా ఎంపికై చిప్పలపల్లి మల్లయ్యను, ఉత్తమ పారిశుద్ధ్య గృహిణిగా ఎంపికైన చిప్పలపల్లి ఎల్లమ్మలను మంగళవారం ఎంపీడీఓ గాలి శోభారాణి, మండల పరిషత్ సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీఓ ధార శ్రీనివాస్, ఏపీఓ రవి, కార్యదర్శులు అరుణ్, అంబేద్కర్, సతీష్, శోభన్ బాబు, శ్రీనివాస్, భవాని పాల్గొన్నారు.



తిరుమలగిరి : పారిశుద్ధ్య వారోత్సవాల్లో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్



నాగారంలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎంపీడీఓ శోభారాణి

ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు మానుకోవాలి



తుంగతుర్తి : మాట్లాడుతున్న నాయకులు

తుంగతుర్తి : ప్రతిపక్ష పార్టీలు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌పై చేస్తున్న అసత్య ఆరోపణ మానుకోవాలని మాజీ సర్పంచ్ కొండగడ్పుల నాగయ్య అన్నారు. మంగళవారం మండలంలోని వెంపటి గ్రామంలో నిర్వహించిన ఎస్సీ సెల్ సమావేశంలో ఆయన ప్రతిపక్షాల ఆరోపణలను ఖండించారు. ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వీరస్వామి, సుధాకర్, ఎల్లయ్య, పరుశరాములు, అంబేద్కర్, జగదీశ్, నాగయ్య, అశోక్, కమలాకర్ పాల్గొన్నారు.

రాజకీయ ఎదుగుదలను ఓర్వలేకనే ఆరోపణ

అర్వపల్లి : రాజకీయంగా ఎదుగుదలను చూసి ఓర్వలేకనే కొంతమంది ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ మండల నాయకుడు బోడ లింగయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితుల సంక్షేమం కోసం ఎమ్మెల్యే పాటు ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందన్నారు.

కూలీలకు బిల్లులు చెల్లించాలి

మునగాల : ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్కలపల్లి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని జగన్నాథపురంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించి మా ట్లాడారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం పనులు జరిగే చోట కూలీలకు అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వసతులు లేక పోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయన వెంట సోంపంగు జానయ్య, ఆరె రామకృష్ణారెడ్డి, పరుశరాములు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివి

- ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్



తుంగతుర్తి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ దీపిక



నూతనకల్ : రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

నూతనకల్ : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివని ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ అన్నారు. మండలంలో 23మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు దేశంలో ఆదర్శంగా నిలిచి ఆడపిల్ల తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం మండల కేంద్రం నుంచి వెంకెపల్లి గ్రామానికి ఎంఆర్ఆర్ నిధుల ద్వారా రూ.3కోట్ల 48లక్షలు, మండల కేంద్రం నుంచి లింగంపల్లి క్రాస్ రోడ్డు వరకు సీఆర్ఆర్ నిధులు ద్వారా రూ.3కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణంతో పాటు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య యాదవ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు చూడి లింగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, సర్పంచ్ కొంపెల్లి రాంరెడ్డి, బద్దం ప్రశాంత్‌రెడ్డి, విద్యాసాగర్, రాంకిషన్, సాయిలుగౌడ్, విజయ్, సురేందర్‌నాయక్, తహసీల్దార్ ఎండీ జమీరుద్దీన్, ఎంపీడీఓ ఇందిరా పాల్గొన్నారు.

ప్రపంచ మేధావి అంబేద్కర్ : ఎమ్మెల్యే

తుంగతుర్తి : ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బండరామారం గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని జెడ్పీచైర్‌పర్సన్ గుజ్జ దీపిక యుగేందర్‌రావులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ -3 ద్వారానే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందన్నారు. అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని సీఎం కేసీఆర్ కొనసాగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుండగాని కవితరాములుగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, వైస్ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం, సర్పంచ్ ఉప్పునూతల ప్రణిత జయచందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, ఆకారపు సైదులు, ముత్తిలింగం, గడ్డం ఉప్పలయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితులను దూషించలేదు..

అంబేద్కర్ విగ్రహ సాక్షిగా నేను దళితులను దూషించలేదని, తాను దళితులను దూషించినట్లు ప్రతిపక్ష పార్టీలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని, ఆత్మీయ సమ్మేళనంలో ఏ ఒక్కరిని కూడా తాను వ్యక్తిగతంగా దూషించలేదన్నారు. తిరుమలగిరి మండలాన్ని దళిత బంధు పైలెట్ ప్రాజెక్టుగా తానే సీఎం కేసీఆర్ దగ్గర కొట్లాడి తీసుకొచ్చానని అన్నారు. దళితులకు ఏచిన్న సమస్య వచ్చినా తానే ముందుండి పోరాడే వ్యక్తినని అన్నారు.

కార్యకర్తలకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది

కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని వెలుగుపల్లి గ్రామానికి చెందిన మల్లేపాక సైదులు ఇటీవల మృతి చెందాడు. దీంతో అతడికి పార్టీ నుంచి మంజూరైన రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కును మంగళవారం తిరుమలగిరిలోని ఎమ్మెల్యే నివాసంలో కుటుంబ సభ్యులకు అందజేశారు.

అర్వపల్లి : కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని కుంచమర్తి గ్రామానికి చెందిన కండె సైదులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అతడికి పార్టీ నుంచి మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును మంగళవారం క్యాంపు కార్యాలయంలో మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, సర్పంచ్ ఉగ్గం ఉపేంద్రలింగరాజు, గ్రామశాఖ అధ్యక్షుడు దుబ్బాక ఎల్లంరాజు, కోఆర్డినేటర్ గౌసుద్దీన్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నాగారం : సీఎం సహాయనిధిని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని ఈటూరు గ్రామానికి చెందిన జి.సైదులు ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఆయనకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.1,25,000ల సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం తిరుమలగిరిలోని ఎమ్మెల్యే నివాసంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, నాయకులు చిల్లర చంద్రమౌళి, కిరణ్‌కుమార్, తీగుళ్ల యాదగిరి, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ క్షమాపణ చెప్పాలి



భానుపురి : మాట్లాడుతున్న పడిదల రవికుమార్



నూతనకల్ : రాస్తారోకో చేస్తున్న నాయకులు

భానుపురి (సూర్యాపేట) : మాదిగ జాతిపై ఇటీవల ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు పడిదల రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గాదరి కిశోర్ రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక కావడానికి ఆ నియోజకవర్గ మాదిగ ఓటర్లు ఓటు వేసి గెలిపిస్తే ఆ జాతిని కించపరచడం దుర్మార్గమన్నారు. ఏనాడైనా నియోజకవర్గంలో ఉన్న దళితుల అభివృద్ధికి, వారి ఎదుగుదలకు సహకరించని కిశోర్ దళిత బంధు పథకాన్ని తన ఇంటి నుంచి ఇచ్చినట్లుగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. రానున్న ఎన్నికల్లో మాదిగల సత్తా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి చింత బాబు, రాష్ట్ర నాయకులు అంబేద్కర్, పల్లేటి లక్ష్మణ్, జానయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, శ్రీను, రామయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు భవిష్యత్‌లో పుట్టగతులు ఉండవు

భానుపురి (సూర్యాపేట) : మాదిగలను విస్మరించిన ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కు తుంగతుర్తి నియోజకవర్గంలో భవిష్యత్‌లో పుట్టగతులు ఉండవని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ యాతాకుల రాజన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మహాజన సోషలిస్టు పార్టీ, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గాదరి కిశోర్ వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడారు. నియోజకవర్గంలో అక్రమ దందాలతో ప్రజాధనాన్ని దోపిడీ చేస్తున్న ఎమ్మెల్యే కిశోర్ అధికార దాహంతో ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఎర్ర వీరస్వామి, బొజ్జ సైదులు, కనుకుంట్ల వెంకన్న, ములకలపల్లి రవి, దాసరి వెంకన్న, పుట్టల మల్లేష్, దైద వెంకన్న, దైద శీను, చింత వెంకన్న, అర్జున్, సుమన్ పాల్గొన్నారు.

నూతనకల్ : ప్రతిపక్ష పార్టీలతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకుల పట్ల ఎమ్మెల్యే గాదరి కిశోర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని, అదేవిధంగా న్యాయవాది యుగేందర్‌పై దాడి చేసిన దుండగులను శిక్షించాలని కోరుతూ అఖిలపక్షాలు, ఎమ్మార్పీఎస్‌ల ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని సూర్యాపేట-దంతాలపల్లి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రశ్నించే గొంతుకులపై నిరంతరం భౌతికదాడులు నిర్వహిస్తూ అలజడులు సృష్టిస్తున్నారని వారు అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు పాల్వాయి బాలయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాల్వాయి పరుశరాములు, ఎమ్మార్పీఎస్ నాయకులు సూరయ్య, నాగమల్లు, సుదర్శన్‌రెడ్డి, గణేష్, మనోజ్, మధు, వీరబాబు, రమేష్ పాల్గొన్నారు.

మహాసభ కరపత్రాల విడుదల

భానుపురి (సూర్యాపేట) : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 28న నిర్వహించనున్న చాకలి ఎస్సీ సాధన సమితి 6వ వార్షికోత్సవ మహాసభ కరపత్రాలను ఆ సంఘం నాయకులు మంగళవారం సూర్యాపేట పట్టణంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సట్టు నాగయ్య మాట్లాడుతూ.. చాకలి కులస్తులకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించి ఆదుకోవాలని కోరారు. రజక ఫెడరేషన్‌కు తెలంగాణ ప్రభుత్వం రూ.450కోట్లు కేటాయించినా ఒక పైసా ఖర్చు చేయలేదన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు భూతరాజు ఉపేందర్, ఎక్కినపల్లి శ్రీను, ఏనుగంటి లింగయ్య, భూతరాజు శైలజ, తాడూరి పద్మ, నీలిమ, సైదమ్మ, సంధ్య, అఖిల, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి

ఆత్మకూర్ (ఎస్) : సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు జలగం జనార్దన్ (జెన్ను) రెండో వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఐఎంకేఎస్ డివిజన్ నాయకుడు అలుగుబెల్లి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వర్ధంతి సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జలగం జనార్దన్ (జన్నన్న) రెండో వర్ధంతిని తన సొంత గ్రామమైన ఏపూర్‌లో ఈనెల 25న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభను ప్రజలు, పార్టీ, ప్రజా సంఘాలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అరుణోదయ జిల్లా కార్యదర్శి కంచనపల్లి సైదులు, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య, ఉపసర్పంచ్ కలంచర్ల చంద్రయ్య, కొరివి వెంకన్న, కొమ్ము లింగయ్య, మధుసూదన్‌రెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

హరితహారం చెట్ల నరికివేతపై విచారణ

చిలుకూరు : మండల పరిధిలోని పోలేనిగూడెం రోడ్డులో హరితహారం చెట్లు నరికివేస్తున్నారని సాక్షిలో మంగళవారం 'హరితహారం చెట్ల నరికివేత' అనే శీర్షికతో వచ్చిన కథనానికి కలెక్టర్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పోలేనిగూడెం రోడ్డులో నరికివేసిన చెట్లను ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీఓ పాండు యాదవ్, ట్రాన్స్‌కో ఏఈ సైదులు, ఆర్ఐ మంత్రిప్రగడ సీతయ్యలు విచారణ చేశారు. ట్రాన్స్‌కో లైన్‌మెన్ రామానాథం ఆదేశాల మేరకు విద్యుత్ సిబ్బంది నాగరాజు విద్యుత్‌వైర్లకు అడ్డుగా ఉన్నాయని చెట్టు కొమ్మలు తొలగించాల్సింది ఉండగా ఏకంగా 15 చెట్లు నరికివేశారని, అలాగే పొలానికి నీడ వస్తుందని రైతు బిట్టు రామారావు ఒక చెట్టు నరికివేసినట్లుగా గుర్తించారు. నాలుగేళ్ల కిందట హరితహారంలో నాటిన 16చెట్లను నరికివేసినందుకుగాను కలెక్టర్ ఆదేశాల మేరకు ముగ్గురిపై పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారని తెలిపారు.